క్లుప్తంగా

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

భాకరాపేట: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని భాకరాపేట ఎస్‌ఐ విజయ్‌కుమార్ నాయక్ తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అనుమతులు లేకుండా రాజకీయ పార్టీలు సంబరాలు చేయకూడదన్నారు. ప్రస్తుతం 144 సెక్షన్, 30 యాక్ట్ అమలులో ఉందన్నారు. ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించే కార్యక్రమాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్

రామచంద్రాపురం: మండలంలోని సీకాలేపల్లి, మిట్టకండ్రిగ, కుప్పంబాదూరు, రాయలచెరువుపేట గ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ కూలీలకు రూ.300 గిట్టుబాటు అయ్యేలా కొలతలు ఇవ్వాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. పనికి వచ్చే ప్రతి కుటుంబం 100 రోజుల పనిని పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ హంసవేణి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛను సొమ్ము ఖాతాలకు జమ


కమిషనర్ రమేష్‌బాబు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలోని పింఛనుదారులకు జూన్ మాసానికి సంబంధించి పింఛను సొమ్మును డీబీటీ విధానంలో వారి బ్యాంకు ఖాతాలోకి జమ చేస్తామని కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆధార్‌కు అనుసంధానమైన బ్యాంకు ఖాతాకు పింఛను సొమ్ము జమ అవుతుందన్నారు. ఇందు కోసం బ్యాంకులో పింఛనుసొమ్ము తీసుకునేందుకు వృద్ధులకు ప్రత్యేక కౌంటర్లు కూడా ఏర్పాటు చేయాలని బ్యాంకు అధికారులను కోరామన్నారు. శనివారం నుంచి 5వ తేదీ వరకు దివ్యాంగులు, తీవ్రమైన అనారోగ్యం కారణంతో వారికి, వితంతువులు, వీల్‌చైర్‌కు పరిమితమైన వారికి సచివాలయ ఉద్యోగులే ఇంటి వద్దకు తెచ్చి అందజేస్తారన్నారు. ఈ ఎండలో లబ్ధిదారులు సచివాలయాల వద్దకు రావాల్సిన అవసరం లేదని తెలిపారు.

90శాతం రాయితీతో విత్తనాలు ఇవ్వాలి

శ్రీకాళహస్తి: ఖరీఫ్‌లో రైతుల డిమాండ్‌ను బట్టి వారికి అవసరమైన విత్తనాలను 90శాతం రాయితీతో సరఫరా చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో శుక్రవారం ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సారి జూన్‌లో వర్షాలు సమృద్ధిగా పడే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ప్రతి ఎకరాకు సాగు నీరు అందేలా రాష్ట్ర ప్రభుత్వం ఇరిగేషన్ కార్యకలాపాలను ముమ్మరం చేయాలన్నారు. కార్యక్రమంలో దాసరి జనార్దన్, హేమలత, రంగయ్య, బాలగురవయ్య, మునిశంకర్, శంకరయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చేతి పంపుల మరమ్మతులు


చేతిపంపును బాగు చేస్తున్న మెకానిక్ మునెయ్య

ఏర్పేడు: మండలంలోని ఎండీ పుత్తూరు ఎస్సీ కాలనీలో సర్పంచ్ మోహనప్రియ ఆధ్వర్యంలో శుక్రవారం రెండు చేతిపంపుల మరమ్మతులు నిర్వహించారు. రెండు రోజుల క్రితం ఎస్సీ కాలనీలో రెండు చేతి పంపులు మరమ్మతులకు గురయ్యాయి. గ్రామస్తులు సమస్యను సర్పంచ్‌కు విన్నవించారు. వెంటనే స్పందించిన సర్పంచ్ సంబంధిత అధికారులతో మాట్లాడి చేతిపంపులకు మరమ్మతులు చేపట్టి తాగునీటి సమస్యను పరిష్కరించారు.

నేడు కీళపూడిలో హనుమాన్ జయంతి

పిచ్చాటూరు: హనుమన్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని కీళపూడిలో ఉన్న శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆంజనేయస్వామి వారికి ఉదయం విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఇందుకోసం ఆలయ ప్రాంగణంలో అరటి చెట్లు, మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తికి భక్తులు స్వహస్తాలతో పాలాభిషేకం కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేయనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు దాతలు అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామవీధుల్లో ఊరేగించనున్నట్లు ఆలయ అర్చకులు కల్పన చెప్పారు.

మత్తు.. జీవితాలు చిత్తు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా 4కే రన్

- పొగాకు రహిత సమాజాన్ని నిర్మిద్దాం
- స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్

తిరుపతి తుడా: పొగాకు వంటి మత్తు పదార్థాలను తీసుకోవడంతో అందమైన జీవితాలు చిత్తు అవుతాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం తిరుపతిలోని కులశేఖర ఆళ్వార్ పడి రోడ్డు నుండి తిమ్మినాయుడిపాళెం రోడ్ వరకు 4 కె రన్ నిర్వహించారు. పర్యావరణాన్ని పొగాకు ఉత్పత్తుల వినియోగం నుండి రక్షించడానికి ప్రయత్నిస్తామని అందరితో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు వంటి మత్తుకు అలవాటు పడితే జీవితాలు బుగ్గిపాలవుతాయి అన్నారు. క్యాన్సర్కు ప్రధాన కారణం పొగాకేనని ఆయన గుర్తు చేశారు. పొగాకు ఉత్పత్తులు తీసుకునే వ్యక్తుల శరీర అవయవాలపై తీవ్ర ప్రభావాన్ని చూపి అనారోగ్యానికి దారి తీస్తాయన్నారు. మెదడులో రక్త ప్రసరణకు అంతరాయం కలిగిస్తుందన్నారు. గొంతు క్యాన్సర్, గుండెపోటుకు పొగాకే కారణమన్నారు. పొగాకుతో కలిగే నష్టాలను గుర్తించి వాటికి దూరంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ శ్రీనివాసులు, డీఆర్ పద్మావతి, బాబు నెహ్రూ రెడ్డి, లావణ్య, అరుణ, మౌనిక, ఇతర వైద్యులు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్

పొగాకు ఉత్పత్తులను వ్యతిరేకిద్దాం

తిరుపతి తుడా: మానవ సమాజానికి హానికరం, క్యాన్సర్ కారకమైన పొగాకు ఉత్పత్తులను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని శుక్రవారం స్విమ్స్ శ్రీపద్మావతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో బలమైన వ్యాపారం పొగాకు అని గుర్తు చేశారు. ఈ పొగాకు వాడకాన్ని కొందరు ఫ్యాషన్‌గా భావిస్తున్నారని అన్నారు. పొగాకు ఉత్పత్తులతో అనేక అనర్థాలున్నాయని తెలిసినా వాటికి బానిసగా మారిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పొగాకు ఉత్పత్తులు తీసుకోవడంతో మనిషి ఆయుష్షు తగ్గుతుందని, అనేక వ్యాధులకు మూల కారణంగా నిలుస్తోందని అన్నారు. పొగాకు నిర్మూలనకు ప్రజలంతా కట్టుబడి సహకరించాలన్నారు. ప్రతి ఒక్కరూ మరో ఐదుగురుకి పొగాకు గురించి వివరించి మాన్పించే ప్రయత్నం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ అధికారులు డాక్టర్ అల్లాడి మోహన్, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ మనో లాస్య, డాక్టర్ సమీరజ, డాక్టర్ భార్గవ్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ గణేష్ ఇతర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెక్‌బౌన్స్ కేసులో మహిళకు ఏడాది జైలు

తిరుపతి లీగల్: చెక్‌బౌన్స్ కేసులో తిరుపతి, వరదరాజనగర్, పోస్ట్ ఆఫీస్ వీధికి చెందిన జీఎస్ కుమారికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి శుక్రవారం తీర్పు చెప్పారు. ఫిర్యాది తరపు న్యాయవాది అబిత తెలిపిన కేసులోని వివరాల మేరకు... తిరుపతి, ఆర్‌సీరోడ్డు, యాదవ కాలనీకి చెందిన సీఎస్ చంద్రశేఖర్ వద్ద కుమారి 2021 ఫిబ్రవరి 22వ తేదీన ఐదు లక్షల రూపాయలు, 2021 ఫిబ్రవరి 24వ తేదీన మరో ఐదు లక్షలు అప్పుగా తీసుకున్నారు. ఆ సొమ్ము చెల్లించే క్రమంలో ఆమె 2021 ఏప్రిల్ 24వ తేదీన ఐదేసి లక్షల రూపాయలు విలువ చేసే రెండు చెక్కులను ఆమె అతనికి ఇచ్చింది. అతను ఆ రెండు చెక్కులను బ్యాంకులో వేయగా బౌన్స్ అయ్యాయి. దీంతో అతను ఆమెపై కోర్టులో చెక్‌బౌన్స్ కేసు దాఖలు చేశాడు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ఆమెకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. అలాగే చెక్కు సొమ్ము పది లక్షల రూపాయలను పరిహారం కింద ఫిర్యాది చంద్రశేఖర్‌కు చెల్లించాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

మరో కేసులో..

తిరుపతి–తిరుచానూరు రోడ్డు, శ్రీనివాసపురానికి చెందిన వీవీఆర్ కన్‌స్ట్రక్షన్స్ యజమాని వి.వెంకటరమణారెడ్డి, తిరుపతి ఆర్‌సీ రోడ్డు, తుడా ఫ్లాట్స్‌కు చెందిన జీఎస్ఆర్ అసోసియేట్స్ యజమాని షేక్ నజీమ్ బేగమ్‌కు వ్యాపార లావాదేవీ కింద ఇచ్చిన రూ.10 లక్షల చెక్కు 2019, జనవరి 30వ తేదీన బౌన్స్ అయ్యింది. దీనిపై ఆమె తిరుపతి 6వ అదనపు జూనియర్ జడ్జి కోర్టులో చెక్‌బౌన్స్ కేసు దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి చెక్కు సొమ్ము, పరిహారం కింద రూ.14.95 లక్షలను ఆమెకు వీవీఆర్ కన్‌స్ట్రక్షన్స్ నెలలోపు చెల్లించాలని లేని ఎడల ఒక ఏడాది శిక్ష అనుభవించాల్సి ఉంటుందని శుక్రవారం తీర్పు చెప్పినట్టు ఆమె తరపు న్యాయవాది చక్రవర్తి తెలిపారు.

14మంది జరిమానా

తిరుపతిలో మద్యం తాగి వాహనాలను నిర్లక్ష్యంగా నడుపుతున్న 14మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసులు 14మందిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

మొక్కలను నాటి సంరక్షించాలి


మొక్కలు నాటుతున్న కేశవులు

ఏర్పేడు: మొక్కలను విరివిగా నాటి ప్రకృతిని పెంపొందించాలని సేవ్ ఆక్సిజన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కేశవులు అన్నారు. సంస్థ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని కొత్తకాల్వ నుంచి పాపానాయుడుపేట ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ ఇళ్ల వద్ద రెండు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. అడవులు నరికివేతకు గురికాకుండా చర్యలు చేపట్టాలన్నారు. మొక్కలతో పర్యావరణ పరిరక్షణ జరుగుతుందన్నారు. సంస్థ స్థాపించినప్పటి నుంచి ఇప్పటి వరకు 6 వేల మొక్కలను ఉచితంగా అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రామనాథరెడ్డి, లోకేష్, నరేంద్ర, మౌళి, చాన్‌బాషా, మణి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కూలీ మృతి

ఏర్పేడు: మండలంలోని కందాడు పాత దళితవాడలో శుక్రవారం వ్యవసాయ కూలీ గుండెపోటుతో మృతి చెందాడు. గ్రామస్తుల కథనం మేరకు, మండలంలోని కందాడు పాత దళితవాడకు చెందిన గొడుగు మునెయ్య(45) కూలీగా జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయ కూలీ పనులు ముగించుకుని మధ్యాహ్నం ఇంటికి చేరుకున్నాడు. ఇంటి వద్దకు చేరుకోగానే గుండెపోటు వచ్చింది. ఆస్పత్రికి తరలించేందుకే మునెయ్య మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని మృతుని కుటుంబ సభ్యులు కోరారు.

పిల్లల్లో సహజ సామర్థ్యాలకు ప్రోత్సాహం


విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందిస్తున్న రాస్ ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్‌రెడ్డి

రేణిగుంట: పిల్లల్లో దాడి ఉన్న సహజ సామర్థ్యాలను ప్రోత్సహిస్తే వారు ఉన్నత స్థాయికి చేరే అవకాశాలుంటాయని కరకంబాడి సర్పంచ్ ఈశ్వరమ్మ అన్నారు. మండలంలోని కరకంబాడి పంచాయతీ ఇందిరానగర్‌లోని రాస్ కార్యాలయంలో శుక్రవారం చైల్డ్ ఫండ్ ఇండియా సహకారంతో పిల్లలకు వివిధ రంగాలపై ఉన్న పట్టును పరీక్షిస్తూ సంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించారు. రాస్ ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దత్తత గ్రామాల్లోని పిల్లలు పాల్గొని కళాప్రదర్శనలు చేశారు. పిల్లలను చదువులతోపాటు వివిధ రంగాల్లో వారికున్న ఆసక్తిని గుర్తించి తల్లిదండ్రులు ఆ దిశగా వారికి సరైన అవకాశాలు కల్పించినప్పుడే పిల్లలు సర్వతోముఖాభివృద్ధి చెందుతారన్నారు. న్యాయనిర్ణేతగా భారత కళాక్షేత్రం నుంచి శ్రీనివాస్ పాల్గొని ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేసి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాస్ ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్‌రెడ్డి, సచివాలయ మహిళా పోలీస్ గౌతమి, రాస్ కో–ఆర్డినేటర్ భారతి, సిబ్బంది పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడి కేసులతో బాధపడొద్దు

- సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా
- రేణిగుంట డీఎస్పీ ఎస్.భవ్యకిషోర్


డీఎస్పీ భవ్యకిషోర్

రేణిగుంట: ''ప్రజాస్వామ్య వ్యవస్థ పరిఢవిల్లేందుకు ఎన్నికలే ప్రధాన అస్త్రం. జూన్ 4వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ అనంతరం ఎవ్వరూ ఆవేశకావేశాలకు గురికావద్దు. తెలిసీ, తెలియక అల్లర్లకు పాల్పడి కేసుల్లో ఇరుక్కుని జీవితాంతం బాధపడవద్దని'' రేణిగుంట డీఎస్పీ ఎస్.భవ్యకిషోర్ హితవు పలికారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా రేణిగుంట పోలీసు సబ్ డివిజన్ పరిధిలో ఎలాంటి అల్లర్లు జరగకుండా చేపడుతున్న చర్యలపై ఆమె మీడియాతో మాట్లాడారు. డీఎస్పీ చెప్పిన విషయాలు ఆమె మాటల్లోనే...

రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలో చిన్నపాటి చెదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. అయితే కౌంటింగ్ రోజున ఎక్కడైనా చిన్నపాటి ఘర్షణ చోటుచేసుకున్నా, ఎవరైనా అసాంఘిక శక్తులు అల్లర్లకు పాల్పడినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఉక్కుపాదం మోపడానికి పోలీసు యంత్రాంగం సిద్ధంగా ఉంది. తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలోని అన్ని స్టేషన్ల పరిధిలో గ్రామాల్లో ఇప్పటికే పోలీసు సిబ్బందితో కలసి నాకాబందీ నిర్వహించి, గ్రామాలన్నీ జల్లెడ పట్టాం.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు పికెట్

రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న 16 సమస్యాత్మక గ్రామాలను గుర్తించాం. అక్కడ ఎలాంటి అల్లర్లకు తావు లేకుండా పోలీసు పికెట్‌ను ఏర్పాటు చేశాం. అలాగే అన్ని గ్రామాల్లో 09 మొబైల్ టీములను ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా పెట్టాం. నాలుగు క్యూఆర్‌టీ (క్విక్ రెస్పాన్స్ టీం) బృందాలు, అలాగే సబ్ డివిజన్ హెడ్ క్వార్టర్స్‌లో ఒక స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ ఏర్పాటు చేశాం.

సంబరాలకు అనుమతులు లేవు

ఓట్ల లెక్కింపు అనంతరం జూన్ నెల 6వ తేదీ వరకు విజయోత్సవాలు, ర్యాలీలు, సంబరాలు చేసుకునేందుకు, బాణాసంచా కాల్చేందుకు అనుమతులు లేవు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రజలెవ్వరూ ఒక చోట గుమికూడరాదు. నిబంధనలను అతిక్రమిస్తే ఎంతటివారినైనా అరెస్ట్ చేసి జైలుకు పంపిస్తాం. ఘర్షణలకు ఉసిగొల్పేవారిని ఉపేక్షించం. ఇప్పటికే సమస్యాత్మక గ్రామాల్లోని ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన నాయకులను పిలిపించి ఎన్నికల కమిషన్ నిబంధనలను విధిగా పాటించాలని అవగాహన కార్యక్రమాలను చేపట్టాం. కేవలం బైక్‌లకు, వాహనాల్లో తప్ప బాటిళ్లలో, క్యాన్లలో ఎవ్వరికీ పెట్రోలు పట్టవద్దని అన్ని పెట్రోల్ బంకుల యజమానులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. ఎవ్వరైనా అతిక్రమించి పట్టితే కఠిన చర్యలు తీసుకుంటాం.

186 మంది బైండోవర్

ఇప్పటి వరకు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా మొత్తం 186 మందిని బైండోవర్ చేశాం. అన్ని గ్రామాల్లోనూ బృందాలుగా ఏర్పడి కార్డెన్ అండ్ సెర్చ్ చేశాం. ఎలాంటి రికార్డులు లేని బైక్‌లు, వాహనాలను సీజ్ చేసి సరైన రికార్డులు చూపిన వాహనాలను విడిచిపెట్టాం. ఇప్పటి వరకు రికార్డులు లేని 23 వాహనాలు పోలీసుల స్వాధీనంలోనే ఉన్నాయి. ఎవరైనా అనుమానితులు, కొత్తవారు గ్రామాల్లో తిష్టవేసినా, లాడ్జీల్లో ఉన్నా వారి కదలికలపై నిఘా ఉంచి అల్లర్లకు పాల్పడే అవకాశం ఉండే వారిని అదుపులోకి తీసుకుని కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ప్రజలు ఎవరి ప్రలోభాలకు గురై అల్లర్లలో భాగస్వామ్యం కావద్దని కోరారు.

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- తిరుపతి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అదితి సింగ్


మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి అదితి సింగ్

తిరుపతి తుడా: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా జూన్ 4వ తేదీన నిర్వహించే ఓట్ల లెక్కింపునకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అదితిసింగ్ పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే సిబ్బంది అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆమె సూచించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియపై సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం కచ్చపి ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓట్ల లెక్కింపులో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేశామని అన్నారు. వారందరూ వారి విధులను నిబద్ధతతో నిర్వహించాలలన్నారు. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో పార్లమెంటు, అసెంబ్లీకి సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు నిర్దేశిత సమయం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు. విధులు కేటాయించబడిన వారందరూ ఉదయం ఆరు గంటలకే కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రాంగణంలోకి వాహనాల అనుమతి ఉండదని, కౌంటింగ్ విధులు కేటాయించిన అందరికీ మెయిన్ గేటు నుంచి కౌంటింగ్ సెంటర్ వరకు బస్సును ఏర్పాటు చేశామని తెలిపారు. భద్రత చర్యల్లో భాగంగా కౌంటింగ్ కేంద్రాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ లో పాల్గొనే సిబ్బందికి, వివిధ రాజకీయ పార్టీల కౌంటింగ్ ఏజెంట్లకి కూడా కచ్చితంగా గుర్తింపు కార్డులు ఉండాలని పేర్కొన్నారు. కౌంటింగ్ విధులు కేటాయించిన సిబ్బందికి తాగు నీరు, భోజన సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. ఫలితాలను ఎప్పటికప్పుడు పారదర్శకంగా తెలియజేసేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి, ఎన్నికల ట్రైనింగ్ ఆఫీసర్ చంద్రమౌళి, తహసీల్దార్ నారాయణరెడ్డి, మేనేజర్ చిట్టిబాబు, ఆర్ఓ సేతుమాధవ్, ఈడీటీ జీవన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన, వ్యవసాయ పంటలే ఆధారం


ప్రదర్శనను తిలకిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి దశరథరామిరెడ్డి

చంద్రగిరి: రాబోయే కాలంలో ఉద్యాన, వ్యవసాయ పంటలపైనే భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని జి ల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని శానంబట్ల పంచాయతీలోని తిరుపతి చీని, నిమ్మ పరిశోధన స్థానం, అనంతరాజుపేట వైఎస్ఆర్ ఉద్యాన కళాశాల ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థినులు పలు రకాల ఉద్యాన పంటలను ప్రదర్శించారు. ఏ సీజన్‌లో ఏ పంటను వేయడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చు అనే అంశంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ పద్ధతులను ఉపయోగించి ఉద్యాన, వ్యవసాయ పంటలను వేసుకోవడం ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చునని తెలిపారు. రానున్న కాలంలో వీటికి మరింత ఆదరణ పెరుగుతుందని తెలియజేశారు. ప్రతి ఒక్క రైతు కూడా పంటలపై అవగాహన పెంచుకుని, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నాణ్యమైన పంటలు, మేలైన దిగుబడులు సాధించేందుకు శాస్త్రవేత్తలు, అధికారులు సూచనలు, సలహాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో చీని, నిమ్మ పరిశోధన స్థానం హెచ్ఓడీ డాక్టర్ నాగరాజు, శాస్త్రవేత్తలు డాక్టర్ కవిత, డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, శైలజ, అధ్యాపకులు జయప్రద, డాక్టర్ రమ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ ఏఓ రవిశంకర్‌కు ఘన సత్కారం

తిరుపతి కల్చరల్: ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్‌ఫోర్స్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పని చేస్తున్న ఎస్.రవిశంకర్ శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో ఆయన్ను ఘనంగా సత్కరించి అభినందించారు. రెండేళ్లుగా టాస్క్‌ఫోర్స్‌లో పని చేస్తున్న ఆయన పదవీ విరమణ పొందిన రవిశంకర్ సన్మానసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ చెంచుబాబు పాల్గొని రవిశంకర్ సేవలను కొనియాడారు. టాస్క్‌ఫోర్స్‌కు అవసరమైన నిధులు సేకరించడంతోపాటు వాటిని సక్రమంగా వినియోగించి మంచి పేరు తెచ్చుకున్నారని తెలిపారు. శేషజీవితం ఆయన ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రవిశంకర్‌ను టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పూలమాలలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఏసీఎఫ్ శ్రీనివాస్, ఎఫ్ఆర్ఓలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

స్వీయ పరిశుభ్రతతో మలేరియా, డెంగీ దూరం

- జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రూప్ కుమార్


దోమల నివారణ చర్యలను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రూప్‌కుమార్

చంద్రగిరి: ప్రజలు తమ ఇళ్ల వద్ద స్వీయ పరిశుభ్రతను ఉంచుకోవడం ద్వారా మలేరియా, డెంగీ వంటి విష జ్వరాల నుంచి తమను తాము రక్షించుకోవచ్చునని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రూప్‌కుమార్ సూచించారు. కొటాల పీహెచ్‌సీ వైద్యాధికారి కుసుమ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బీడీ కాలనీ, వికలాంగుల కాలనీలలో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. దోమకాటు వలన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, బోదకాలు, మెదడువాపు వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. వాటి నివారణ కోసం ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి ఆవరణలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, మురుగు నీరును సైతం కింద ప్రాంతానికి వెళ్లేలా చూసుకోవాలన్నారు. పనికిరాని వస్తువులను ఇంటి ఆవరణలో ఓ వైపు ఉంచడం ద్వారా కూడా దోమలకు ఆవాస కేంద్రాలుగా మారుతాయన్నారు. ప్రజలు కూడా వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా విష జ్వరాలు ప్రబలకుండా ఆరోగ్యకరమైన జీవితాన్ని అనుభవించవచ్చునని సూచించారు. అదే విధంగా దోమలను నివారించేందుకు వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం డ్రై డేను నిర్వహిస్తూ, ఇండోర్ రెసిడువల్ రసాయనాన్ని స్ప్రే చేస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌యుఓ శివయ్య, ఎంపీహెచ్ఈఓ ఈశ్వరయ్య, సిరాజుద్దీన్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విరివిగా కూలీలకు పనులు కల్పించాలి


కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ సరిత

ఏర్పేడు: ఉపాధి హామీ పథకంలో విరివిగా కూలీలకు పనులు కల్పించాలని అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సరిత అన్నారు. మండలంలోని అంజిమేడు పంచాయతీలో శుక్రవారం జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీడీ పరిశీలించారు. కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో వంద మంది కూలీలు తగ్గకుండా పనులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది కూలీలతో ప్రతి రోజూ మాట్లాడి ఎక్కువ మంది పనులకు వచ్చేలా చూడాలని కోరారు. ఎండతీవ్రత పెరుగుతుండడంతో ఉదయం 6 గంటల నుంచి పనులు ప్రారంభించి 10 గంటలకు ముగించుకుని ఇళ్లకు వెళ్లాలని సూచించారు. పని ప్రదేశంలో కూలీలకు నీరు, నీడ, ప్రథమ చికిత్స పెట్టె అందుబాటులో ఉంచాలన్నారు. రైతుల పొలాల్లో నీటిగుంతల ఏర్పాటుతో భూగర్భ జలాలపెంపు ఉంటుందని పేర్కొన్నారు. తద్వారా వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు పెంపొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీవో దేవరి, సాంకేతిక సహాయకుడు రవీంద్రుడు, క్షేత్ర సహాయకురాలు గీతాంజలి, కూలీలు పాల్గొన్నారు.

వైభవంగా కావమ్మ మారయ్య ఊరేగింపు


ఊరేగుతున్న కావమ్మ, మారయ్య

నాగలాపురం: పట్టణంలో వీకేఎం వీధిలో ఉన్న కావమ్మ సమేత మారయ్య ఆలయంలో జరుగుతున్న తిరునాళ్లలో భాగంగా మూడో రోజు శుక్రవారం అమ్మవారి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా అమ్మవారికి పలు రకాల పూజలు చేశారు. వేకువజామున ఆలయాన్ని శుద్ధి చేసి ఆలయాన్ని సుందరంగా పూలతో అలంకరించి ముస్తాబు చేశారు. అనంతరం కావమ్మకు ప్రత్యేక పూజలు చేసి, విశేష అలంకరణ చేశారు. భారీ ఎత్తున భక్తులు, మహిళలు ఆలయ ప్రాంగణలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయానికి వచ్చిన భక్తులందరికీ అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి పుత్తూరు శ్రీవిద్య కళాశాల విద్యాసంస్థ వారు ఉభయకర్తలుగా వ్యవహరించారు. సాయంత్రం అమ్మవారిని రకరకాల పూలతో సుందరంగా అలంకరించి తప్పెట్లు, మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు జె.గోవిందుడు, చెంగల్‌రాయులు, ఆర్‌వీ రమణయ్య, రాంబాబు, గురవయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.